శునకం.. భయానకం

- వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు
- 54 డివిజన్లలో 20 వేలకు పైగా గ్రామ సింహాలు
- తరచూ కుక్కల దాడిలో గాయపడుతున్న ప్రజలు
- ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోని అధికారులు



నెల్లూరు(సిటీ): నగరంలో రోడ్లపైకి రావాలంటే ప్రజలు హడలిపోతున్నారు. దొంగలు వచ్చి మెడలోని నగలు దోచుకెళ్తారనో.. రోడ్డు ప్రమాదాల బారిన పడతామనో కాదు.. రోడ్లపై గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్న గ్రామ సింహాలను చూసి భయాందోళన చెందుతున్నారు. అసలే వర్షాకాలం కాలం.. ఏ క్షణంలోనైనా కుక్కలు దాడి చేసే అవకాశం ఉండడంతో భయంభయంగా వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. అధికారుల అలసత్వంతోనే ఈ పరిస్థితి దాపురించిందని ప్రజలు వాపోతున్నారు. నగరంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో కుక్కల దాడిలో గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో చిన్నారులు, వృద్ధులు, మహిళలు కూడా ఉన్నారు. నెల్లూరు నగరంలోని 54 డివిజన్లలో 20 వేలకు పైగా కుక్కలు ఉన్నట్లు అంచనా. కుక్కల బారి నుంచి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత కార్పొరేషన్ అధికారులపై ఉన్నప్పటికీ నగరంలో జరుగుతున్న ఘటనలను చూస్తే చర్యలు నామమాత్రంగానే ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

చిల్డ్రన్స్ పార్క్‌లో 8 మందిని కరిచిన కుక్క

గత వారం నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో వాకింగ్ చేస్తున్న 8 మందిపై ఓ కుక్క విచక్షణారహితంగా దాడి చేయడంతో వారు ఆస్పత్రి పాలయ్యారని తెలిసింది. అయితే ఈ విషయాన్ని సంబంధిత అధికారులు గోప్యంగా ఉంచారని తెలుస్తోంది. అలాగే బీవీనగర్, వేదాయపాళెం ప్రాంతాల్లో ఇటీవల కుక్కలు కరిచి పలువురికి తీవ్ర గాయాలై ఆస్పత్రి పాలయ్యారు. ఇలాంటి ఘటనలు ప్రతి రోజూ ప్రతి డివిజన్‌లో జరుగుతూనే ఉన్నా కార్పొరేషన్ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని నగర ప్రజలు మండిపడుతున్నారు.

ఆపరేషన్లు చేసైనా ప్రజలను కాపాడాలి

వీధి కుక్కలను తగ్గించేందుకు కార్పొరేషన్ అధికారులు వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి వాటి సంఖ్యను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోజుకు 20 నుంచి 30 కుక్కలకు ఆపరేషన్లు చేయడం ద్వారా వీటి సంఖ్యను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

వీధి కుక్కలతో భయంగా ఉంది



స్టోన్‌హౌస్‌పేట, ఆర్ఎస్ఆర్ స్కూల్ వీధి, ముంగమూరి వీధి పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రోడ్లపై నడవాలంటే భయమేస్తోంది. కుక్కలు గుంపులుగా సంచరిస్తూ పాదచారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలి.

– మనోజ్, స్టోన్‌హౌస్‌పేట

కాపాడండి మహా ప్రభో



పప్పులవీధి, జీనిగలవారివీధి, వీవర్స్ కాలనీ, వెంగమాంబ సెంటర్‌లలో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. షాపులకు వెళ్లి ఏవైనా సరుకులు తెచ్చేటప్పుడు వెంటబడి ఆహార పదార్థాలను లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నాయి. వాటిని తరిమే క్రమంలో దాడి చేసి గాయపరుస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు కుక్కల దాడిలో గాయాల పాలవుతున్నారు. కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడండి మహా ప్రభో.

– రవిప్రవీణ్, పప్పులవీధి

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

- ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్



మాట్లాడుతున్న పీడీ హేనాసుజన్

నెల్లూరు(అర్బన్): మహిళలను వేధింపులకు గురి చేసేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి (ఐసీడీఎస్ పీడీ) హేనాసుజన్ తెలిపారు. శుక్రవారం నగరంలోని నారాయణ డెంటల్ ఆస్పత్రిలో డెంటల్ కళాశాల విద్యార్థులకు, మహిళా సిబ్బందికి షీ కమిటీ ఆధ్వర్యంలో లైంగిక వేధింపులు, రక్షణ చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగిక వేధింపుల నిరోధానికి స్వచ్ఛంద సంస్థలు, కళాశాలల యాజమాన్యాలు కృషి చేయాలన్నారు. వేధింపులతోపాటు మహిళలను కించపరిచే విధంగా ప్రవర్తించినా క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అందుకు సంబంధించి చట్టాలు, శిక్షలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సమత, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అజయ్‌రెజినాల్డ్, డాక్టర్ శివకుమార్, షి కమిటీ చైర్మన్ డా.వందన రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఉపాధ్యాయులకు వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు

నెల్లూరు(టౌన్): స్థానిక చెముడుగుంటలోని జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం సమగ్ర శిక్ష, జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాలల్లో నూతన పాఠ్యాంశాలపై ప్రయోగ పూర్వక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేజీబీవీల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బోధిస్తున్న 43 మంది సైన్స్, గణిత ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్స్‌కు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ గీత మాట్లాడుతూ జన్య ఫౌండేషన్ సమకూర్చిన బోధన, అభ్యసన పరికరాల ద్వారా నేర్చుకున్న పాఠ్యాంశాలను తరగతి గదిలో విద్యార్థులకు బోధించాలన్నారు. విద్యార్థులు వారి చేతులతో కృత్యాలను అభ్యసించేలా అవకాశం కల్పించాలన్నారు. ఈ పరికరాలను జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. అనంతరం జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జన్య ల్యాబ్ ఇన్ ఎ బాక్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఈఓ. పీవీజే రామారావు, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, జీసీడీఓ మమత, ఏఎంఓ సుధీర్, సీఎంఓ పెంచలయ్య, జన్య ఫౌండేషన్ ప్రతినిధులు కనకమేడల సురేంద్రకుమార్, శివకుమార్, సబ్జెక్ట్ నిపుణులు ప్రఖ్య, సత్యనారాయణ శర్మ, శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి గురుపూర్ణిమ ఉత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని బాలాజీ నగర్‌లోని శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరంలో శనివారం నుంచి సోమవారం వరకు గురుపూర్ణిమ మహోత్సవాలు జరగనున్నాయని ఆ మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి శుక్రవారం తెలిపారు. గురుపూర్ణిమ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు శ్రీసాయిదర్బార్‌లో వేడుకలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 'ఓంసాయి శ్రీసాయి జయజయసాయి' అఖండ సాయి నామసంకీర్తన, షిర్డీ హారతులు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, ఉత్సవాలు, భజనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీసాయిసచ్చరిత్రము అఖండపారాయణం జరుగుతుందని తెలిపారు. అలాగే ఈ నెల 28వ తేదీన ఉదయం 9 గంటల నుంచి శ్రీసాయిమాత నిత్యఅన్నప్రసాదాలయం ద్వారకామయిలో డాక్టర్ పీఎల్‌రావు మోడరన్ ఐ హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర శస్త్రచికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు తెహలీల్ ఫాతెహా

నెల్లూరు(బృందావనం): రొట్టెల పండగలో భాగంగా శనివారం బారాషహీద్‌లను స్మరిస్తూ 'తెహలీల్ ఫాతెహా'' (చదివింపులు) నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తులు బారాషహీద్ దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకొంటారు. తెహలీల్ పాతెహా ఉదయం 9 గంటలకు జరగనుంది.

రేపు రొట్టెల పండగ ముగింపు

రొట్టెల పండగలో భాగంగా ఆదివారం ఉదయం 11 గంటలకు ముగింపు సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఐదు రోజుల పండగను జయప్రదం చేసిన అధికార యంత్రాంగానికి అభినందన కార్యక్రమం జరగనుంది.

ఇంత నిర్లక్ష్యమా..



నీటిపైపులు పగిలిపోయి వృథాగా పోతున్న నీరు

నెల్లూరు(బారకాసు): నగరంలోని బృందావనం ప్రాంతంలో ఉన్న తిక్కన భవనం వెనుక వీధిలో మంచినీటి పైపులు పగిలిపోయి నీరు రోడ్డుపైకి వృథాగా పోతోంది. దీంతో ఆ వీధిలో రోడ్డు మొత్తం బురదమయమవుతోంది. గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు. నగరపాలక అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'తప్పుడు కేసులు బనాయిస్తున్నారు'

- ఓల్వో డ్రైవర్ల ఆందోళన

ముత్తుకూరు : కృష్ణపట్నం పోర్టులో జరిగిన చిన్న వివాదాన్ని కొండంత చేస్తూ సీఐటీయూ తప్పుడు కేసులు బనాయిస్తోందని పోర్టులో పనిచేసే ఓల్వో డ్రైవర్లు ఆందోళన వెలిబుచ్చారు. ముత్తుకూరులో శుక్రవారం వారు విలేకరుల సమావేశంతో మాట్లాడారు. డ్రైవర్ల మధ్య ఇటీవల చిన్న వివాదం ఏర్పడిందని, దీనిని పెద్దది చేసి తాము కొంతమందిపై దాడి చేసినట్టు సృష్టించి తమ ఉద్యోగాలకే ఎసరు పెడుతున్నారని విచారం వెలిబుచ్చారు. తాము యూనియన్‌లో లేమన్న కారణంగా సీఐటీయూ తమపై హత్యాయత్నం కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సీఐటీయూలో ఉన్నప్పుడు తమకు సన్మానాలు చేశారని, ఇప్పుడు ఆకతాయిలుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. పోర్టు కార్మికులపై సీఐటీయూ వివక్ష చూపడం మంచిది కాదన్నారు. తమ సమస్యలు ఏమైనా ఉంటే పోర్టు యాజమాన్యం ద్వారా పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు.

ఈఎస్ఐ కార్డుల అందజేత



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి కమిషనర్ రమణబాబు శుక్రవారం ఈఎస్ఐ కార్డులు అందజేశారు. నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ ఈఎస్ఐ కార్డులను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలున్నా కార్డు ద్వారా ఉచిత వైద్య సదుపాయాలు పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మూడు దుకాణాల్లో నగదు చోరీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని మార్కెట్ వీధిలో మూడు చిరు దుకాణాల్లో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మూడు దుకాణాల్లో రూ.6 వేలు చోరీ జరిగిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

గంధ మహోత్సవానికి భారీ బందోబస్తు



దర్గా ఆవరణను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): బారాషహీద్ దర్గా వద్ద గంధ మహోత్సవ కార్యక్రమం గురువారం రాత్రి భారీ బందోబస్తు మధ్య ముగిసింది. గంధ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం, తోపులాట జరిగే అవకాశం ఉండడంతో పోలీసు అధికారులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ గురువారం రాత్రి దర్గాకు చేరుకుని దర్గా ఆవరణలో బందోబస్తు ఏర్పాట్లు, గంధం ఊరేగింపు ప్రాంతం, కమాండ్ కంట్రోల్ రూమ్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. పోలీసు బందోబస్తు మధ్య గంధం దర్గా ప్రాంగణానికి చేరుకున్న అనంతరం దర్గా ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించి గంధ మహోత్సవం పూర్తి చేశారు. శుక్రవారం భక్తులు దర్గాను సందర్శించుకున్నారు. ఏడుగురు పిక్‌పాకెటర్లను క్రైమ్ పార్టీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. తప్పిపోయిన 152 మంది చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్పీ వెంట ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు, నెల్లూరు నగర, కావలి డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్యాధికారులు

నెల్లూరు(సిటీ): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం వైద్యాధికారులు కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మొగళ్లూరు, సౌత్‌మోపూరు గ్రామాల్లో సర్వే నిర్వహించిన అధికారులు కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాధి ఉన్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహించే ఈ సర్వేలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ప్రతి ఇంటికీ వెళ్లి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలని వైద్యాధికారులు సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సురేంద్రబాబు, నరసింహులు, ప్రసాద్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దేహ, అవయవ దానాలపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న సింహపురి దేహ సమర్పణ సంస్థ కన్వీనర్ విజయ తదితరులు

నెల్లూరు(అర్బన్): మరణించిన తర్వాత కూడా పది మందికి ఉపయోగపడే దేహ, అవయవ, నేత్ర దానాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సింహపురి దేహ సమర్పణ సంస్థ కన్వీనర్ పి.విజయ సూచించారు. శుక్రవారం స్థానిక బీవీనగర్‌లోని పెన్షనర్ల అసోసియేషన్ భవన్‌లో సింహపురి దేహ సమర్పణ సంస్థ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సంస్థలో సభ్యులుగా చేరిన వారు మరణాంతరం దేహాన్ని మెడికల్ కళాశాలలకు వైద్య విద్యకు అందించేందుకు ప్రమాణ పత్రం రాసిచ్చారన్నారు. అలాగే నేత్ర దానానికి అంగీకరించారన్నారు. అవయవ, దేహ, నేత్ర దానాలతోపాటు స్వచ్ఛంద రక్తదానంపై పెద్ద ఎత్తున కళారూపాలు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ ఎంవీ రమణయ్య, జీజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాశీషా, న్యాయవాది బ్రహ్మం, డీకేడబ్ల్యూ కళాశాల లెక్చరర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి రొట్టె పట్టుకున్న మంత్రి



రొట్టె పట్టుకుంటున్న మంత్రి నారాయణ

నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ సందర్భంగా శుక్రవారం స్వర్ణాల చెరువులో రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ రాష్ట్రాభివృద్ధి రొట్టెను పట్టుకున్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సంతోషంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. మంత్రి వెంట ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నేతలు అబ్దుల్‌అజీజ్, తాళ్లపాక అనురాధ, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సరస్వతీనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా సరస్వతినగర్, రామ్‌నగర్, పాత మిలటరీ కాలనీ, క్రాంతినగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అలాగే గోమతినగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఇండోర్ స్టేడియం ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఇస్కాన్‌సిటీ, ఇస్కాన్‌టెంపుల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు

నెల్లూరు(లీగల్): విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులు పప్పుల శ్రీనివాసరావు, పిల్ల సుధాకర్, ఎర్రంశెట్టి పూర్ణమహేష్‌లపై జరిగిన దాడికి నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమమహేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



భక్తులకు సూచనలిస్తున్న డాక్టర్

నెల్లూరు(అర్బన్): నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండగకు వస్తున్న భక్తుల కోసం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ ఆస్పత్రి పీఆర్వో చందువర్మ మాట్లాడుతూ భక్తుల కోసం ఈ నెల 17వ తేదీ నుంచి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రొట్టెల పండగ పూర్తయ్యే వరకు వైద్యశిబిరాన్ని కొనసాగిస్తామన్నారు. కాగా పలువురు భక్తులు ఈ వైద్యశిబిరం వైద్య సేవలు పొందారు.

రేపు దేవాంగ వివాహ పరిచయ వేదిక

నెల్లూరు(బృందావనం): జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి దేవాంగ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ మన్నెం సతీష్, పముజుల శంకరయ్య శుక్రవారం తెలిపారు. నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న హెచ్ఆర్ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి వివాహ పరిచయ వేదిక ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లాలోని దేవాంగ సంఘీయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వారాహి అలంకారంలో రాజరాజేశ్వరి అమ్మవారు



నెల్లూరు(బృందావనం): నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారు వారాహి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అనివెటి మండపంలో అమ్మవారికి శాకంబరి అలంకారం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

జైన మత గురువుల 'చాతుర్మాస్ నగర ప్రవేశ్'



నెల్లూరు(బృందావనం): నగరంలో జైన మత గురువుల 'చాతుర్మాస్ నగర్ ప్రవేశ్' కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీజైన్ శ్వేతంబర్ మూర్తి పూజక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆచార్య ఉదయప్రభభానుసూరిశ్వర్ శిష్య బృందంలోని ముని ధన్యప్రభ, ముని గోయంప్రభ గురువులు నగర ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమం ఆచారివీధిలోని రాజేందర్ టవర్ నుంచి ప్రారంభమై మండపాలవీధిలోని జైన్ ఆలయం వరకు సాగింది. సుమతి శ్రేయన్స్ జైన్ డోల్ బృందం ఆధ్వర్యంలో గురువులకు ఘన స్వాగతం పలికారు. జైన్ ఆరాధన భవన్‌లో కిషోర్‌జైన్ బృందం భక్తిగీతాలను ఆలపించారు.

ఫోర్జరీ సంతకాలపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): నగరపాలక సంస్థ కమిషనర్ సంతకాలను ఫోర్జరీ చేసిన ఘటనలోని నిందితులపై దర్గామిట్ట పోలీసులు శుక్రవారం నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు నగరపాలక సంస్థలో కొందరు కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. ఈ వ్యవహారంలో నగర మేయర్ భర్త జయవర్ధన్, అసిస్టెంట్ శివకృష్ణ, మరికొందరిపై ఆరోపణలు గుప్పుమన్నాయి. తన సంతకాన్ని ఫోర్జరీ చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని గత కమిషనర్ వికాస్‌మర్మత్ ఈ నెల మొదట్లో అప్పటి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణ జరిపిన ఉన్నతాధికారులు తాజాగా దర్గామిట్ట పోలీసులను కేసు నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో దర్గామిట్ట పోలీసులు ఫోర్జరీ సంతకాల ఘటనపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలోని పాత్రదారుల అరెస్ట్‌కు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ వ్యవహారంలో బాధ్యులంటూ నలుగురు ఉద్యోగులను అప్పటి కమిషనర్ సస్పెండ్ చేసిన విషయం విదితమే.

ఘన సన్మానం

నెల్లూరు(బృందావనం): నగరంలోని పొగతోటలో ఉన్న ఆదిశంకర ధ్యాన మందిరంలో శుక్రవారం రాత్రి జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి పాలకవర్గ సభ్యులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. సమితి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ రామాయణం మణిశంకర్‌శర్మ, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన ఇనమనమెల్లూరు విజయలక్ష్మి, సురభి ఉమాదేవిలను చక్రాల వారి ట్రస్ట్, ఆదిశంకర ధ్యాన మందిర కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.